
సాక్షి ఒడిశా

గురువారం । 15 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ.4,00,239

బంగారం: 450 మిల్లీ గ్రాములు

వెండి: 5 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



కుండపోత వర్షం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. - 8లో



ఎస్ఈబీసీ విద్యార్థులకు రిజర్వేషన్ల ప్రకటన

రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాల్లో ఎస్ఈబీసీ విద్యార్థులకు 11.25 శాతం రిజర్వేషన్లు ప్రకటించారు. - 8లో

న్యూస్‌రీల్

రోడ్డు నిర్మించాలని వినతి



బీడీవో రాజీవ్‌దాస్‌కు సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

పర్లాకిమిడి: జిల్లాలోని మోహనా బ్లాక్ ఖర్చబడి పంచాయతీ పరిధి గోవిందపూర్ మామిడితోట జంక్షన్ నుంచి గోంగరి గావ్, బి.రైసింగి వరకు రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు మోహనా సమితి చైర్మన్ రాజీవ్ శౌబోరో ఆధ్వర్యంలో మోహనాలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోహనా బీడీవో రాజీవ్ దాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 75 ఏళ్లుగా ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

జయపురంలో ఇంటింటా సర్వే



సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం సమితి, మున్సిపాలిటీలో 18 ఏళ్లలోపు నిరక్షరాస్యులు, డ్రాపౌట్స్ సర్వేను ఇంటింటా నిర్వహించారు. మొత్తం 15 క్లస్టర్లు ఏర్పాటు చేసి సర్వే నిర్వహించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సంగ్రహించిన వివరాలను టేబులైజేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు. టేబులైజేషన్ పూర్తయితే పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



గజపతి కలెక్టరేట్ వద్ద లక్ష్మీపురం గ్రామస్తులు

పర్లాకిమిడి: కాశీనగర్ బ్లాక్ సిద్ధమణుగు పంచాయతీ పరిధి చిత్రకార్ లక్ష్మీపురం గ్రామంలో ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని లక్ష్మీపురం గ్రామస్తులు వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో పాలనాధికారికి బుధవారం అందజేశారు. ఆ భూమిలో ఇదివరకు గ్రామానికి సామాజిక కేంద్ర భవనం నిర్మించాలనుకున్నామని తెలిపారు. అయితే కొంతమంది రియల్ ఎస్టేటర్లు ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ కాశీనగర్ తహసీల్దార్‌కు సైతం మరో వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్‌ను కలిసినవారిలో లక్ష్మీకోరాయి, ఎం.గోవింద తదితరులు ఉన్నారు.

నదిలో మునిగి బాలుడు మృతి



బాలుడి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి ఎంపీవీ గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలుడు శబరీ నదిలో మునిగి మృత్యువాతపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎంపీవీ గ్రామంలో అర్జున్ మీరాజ్ కుటుంబం నివాసముంటోంది. అతడి కుమారుడు ఏడేళ్ల నాయన్ మీర్జా సెలవులు కావడంతో తోటి పిల్లలతో కలిసి స్నానానికి గ్రామానికి సమీపంలోని శబరీ నదికి వెళ్లాడు. అయితే నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఇద్దరు పిల్లలు కొట్టుకుపోయారు. తోటి పిల్లలు కేకలు వేయడంతో అక్కడే ఉన్నటువంటి ఒక వ్యక్తి వారిని రక్షించే ప్రయత్నం చేశాడు. ఇద్దరిలో ఒకరిని మాత్రమే రక్షించగలిగాడు. ఈ విషయం తెలిసిన తండ్రి అర్జున్ కూడా నీటిలో దూకి వెదికారు. అయితే కొంతదూరంలో బాలుడు తేలుతూ కన్పించాడు. వెంటనే బాలుడిని పోడియా ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లగా అక్కడ వైద్యులు బాలుడు మృతి చెందినట్లు వెల్లడించారు. వెంటనే పోడియా పోలీసులకు సమాచారం ఇవ్వగా ఐఐసీ రామేశ్వర్ ప్రధాన్ ఆరోగ్య కేంద్రానికి చేరుకొని కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం కోసం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

జయహో.. భారత్..!



జాతీయ పతాకంతో సీఎం మోహన్ చరణ్ మాఝి



నగర వీధుల్లో సిందూర్ పరాక్రమ యాత్ర



యాత్ర బైక్ యాత్రతో కిటకిటలాడిన రోడ్డు

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా నగరంలో బుధవారం పరాక్రమ యాత్ర నిర్వహించారు. ఈ పోరులో తనువు చాలించిన ముగ్గురు అమర వీరులకు నివాళులర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి జెండా ఊపి ఈ కార్యక్రమం ప్రారంభించారు. స్థానిక కళింగ స్టేడియం 3వ నంబర్ గేటు నుంచి రాజ్‌భవన్ చౌరస్తా వరకు పరాక్రమ యాత్ర కొనసాగింది. ఉగ్రవాదంపై పోరాటంలో ప్రాణాలర్పించిన మన వీర సైనికులకు నివాళులు అర్పించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ర్యాలీలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనడం దేశభక్తిని చాటుతోందని పేర్కొన్నారు. పోలీసులు, కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్), ఎన్‌సీసీ, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు. - భువనేశ్వర్



పతాకం ఊపి పరాక్రమ యాత్ర ప్రారంభిస్తున్న సీఎం మోహన్‌చరణ్

విద్యార్థులకు నడక పోటీలు



నడక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: నడకతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ సభ్యులు నడక పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 19 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో సాయిప్రియ నగర్ కాలనీలో నిర్వహించిన ఈ పోటీల్లో హుస్సేన్ ఖాన్ ప్రథమ స్థానం, హరున్, కె.రుచితేష్‌లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ.. నడవడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు పేకే ప్రధాన్, కె.వైకుంఠరావు, బిజయ్ చంద్రపాత్రో, సన్యాసి పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై మంటలు



విద్యుత్ స్తంభంపై ఎగసిపడుతున్న మంటలు

జయపురం: కొరాపుట్ జిల్లా సెమిలిగుడ - నందపూర్ మార్గంలో ఒక విద్యుత్ స్తంభంపై బుధవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ విభాగ ఎస్‌డీవోకు సమాచారం అందజేశారు. విద్యుత్ సిబ్బంది స్పందించి సరఫరాను నిలిపివేశారు. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సునాబెడ ఎస్డీవో గోపాల కృష్ణ ప్రధాన్ మాట్లాడుతూ.. ఘటనపై దర్యాప్తు చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు



తనూజా సామంత్



శుభలగ్న పాఢి



పార్థసారథి సాహు



తత్సత్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: పర్లాకిమిడి సెంచూరియన్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. మొత్తం 155 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా శతశాతం ఉత్తీర్ణత సాధించారు. స్కూల్ టాపర్‌గా 98 శాతం మార్కులు సాధించి పార్థసారథి సాహు నిలవగా, 97.8 శాతం మార్కులతో తత్సత్ పాణిగ్రాహి రెండోస్థానంలో నిలిచాడు. 90 శాతం మార్కులు ఎనిమిది మంది విద్యార్థులు సాధించారు. అలాగే ప్లస్ టూ ఫలితాల్లో సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ టాపర్‌గా కుమారి తనూజా సమంత్ 92 శాతం మార్కులు సాధించింది, అలాగే 91.67 శాతం మార్కులతో రెండోస్థానంలో శుభలగ్న పాఢి నిలిచింది. మొత్తం 135 విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 90 మంది ఫస్ట్‌క్లాస్‌లో పాసైనట్లు ప్రిన్సిపాల్ సునీతా పాణిగ్రాహి తెలియజేశారు.

షడ్భుజ గౌరంగ రూపం



పవిత్ర వైశాఖ కృష్ణ పక్షం ప్రతిపాద తిథి పురస్కరించుకుని పూరీ శ్రీజగన్నాథుని ప్రతినిధి మదన మోహనుడు షడ్భుజ గౌరంగ రూపంలో దర్శనమిచ్చాడు. స్వామి వెలుపలి చందన యాత్రలో భాగంగా 13వ రోజున నరేంద్ర పుష్కరిణి చందన మండపంపై ఈ అలంకారంలో స్వామి నవకాంతులు వెదజల్లాడని భక్తులు మురిసిపోయారు. - భువనేశ్వర్

ప్రాణాలు తీసిన పిడుగులు

- రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి



జయపురం: మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

జయపురం: కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి అంపావల్లి పంచాయతీ కందపుటాబంద్ గ్రామంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగు పడడంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో పాటు గ్రామంలో ఒక మహిళ దుర్మరణం చెందారు. వారితో పాటు వారి పెంపుడు కుక్క కూడా పిడుగుపడి మరణించినట్లు సమాచారం. మరణించిన వారిలో తండ్రి గమేల్ కృష్ణ, అతడి కుమార్తె గమేల్ కౌమి(13), మహిళ గమేల్ తుంబయలు ఉన్నట్లు తెలుస్తోంది. సాయంత్రం వర్షం పడిన సమయంలో వారంతా ఒక చెట్టు కిందకు వెళ్లారు. ఆ సమయంలో పిడుగు చెట్టుపై పడడంతో సంఘటన స్థలంలోనే మరణించారు. ఘటనపై దర్యాప్తు జరిపేందుకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పంపినట్లు పొట్టంగి తహసీల్దార్ బహదేర్ సింగ్ దరువ వెల్లడించారు.

పిడుగుపడి బాలుడు మృతి

రాయగడ: పిడుగుపడి బాలుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి వంటామడలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన బాలుడు సన్యాసి హిమిరిక (15)గా గుర్తించారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో తమ కుటుంబీకులకు వ్యవసాయం పనుల్లో సహకరించేందుకు సన్యాసి తమ గ్రామానికి సమీపంలో పంట పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ఒక చెట్టు కింద నిలబడిన సన్యాసిపై పిడుగుపడడంతో సంఘటన స్థలం వద్దే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



సన్యాసి హిమిరిక మృతదేహం

విగ్రహం ధ్వంసంలో నా ప్రమేయం లేదు

- పెంట పంచాయతీ సర్పంచ్ విశ్వనాథ్ స్పష్టీకరణ



విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్ విశ్వనాథ్ తదితరులు

రాయగడ: చందిలి పోలీసుస్టేషన్ పరిధి టంపరగుడ కొండపై బుద్ధుడి విగ్రహం ధ్వంసమైన ఘటనలో తన ప్రమేయం లేదని పెంట పంచాయతీ సర్పంచ్ ఎ.విశ్వనాథ్ స్పష్టం చేశారు. ఈనెల 12వ తేదీన అర్ధరాత్రి టంపరగుడ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన విషయంపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జితు జకసిక పెంట పంచాయతీ సర్పంచ్‌పై చందిలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సర్పంచ్ విశ్వనాథ్ మంగళవారం పెంట పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేస్తే తనపై ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు. కొద్దిరోజుల క్రితం టంపరగుడ గ్రామ (కొండ కింద)లోని స్థలంలో అభిపలక అనే వ్యక్తి ప్లాటింగ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో కొండపై బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేస్తే తమ ప్లాట్లకు మంచి ధర పలుకుతుందని భావించి అక్కడ విగ్రహం ఏర్పాటు చేశారని వివరించారు. అయితే కొండ ప్రాంతం రాష్ట్ర రెవెన్యూ విభాగానికి చెందినదని అయితే టంపరగుడ గ్రామ ప్రజలు ఆ కొండపై జీడి, మామిడి వంటి పంటలను పండించుకుని జీవనోపాధి పొందుతున్నారన్నారు. గ్రామస్తుల అభిప్రాయాన్ని తెలుసుకోకుండా కొండపై విగ్రహం ఏర్పాటు చేయడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఒకవేళ బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేయాలనుకుంటే అభిపలక అనే వ్యక్తి సొంత స్థలంలో ఏర్పాటు చేసుంటే తాము కూడా సహకరించేవాళ్లమని పేర్కొన్నారు. అయితే విగ్రహాన్ని ధ్వంసం చేసేంత దుర్మార్గులము కాదని పేర్కొన్నారు. వారే విగ్రహాన్ని ఏర్పాటు చేసి, వారే దానిని ధ్వంసం చేసి తిరిగి తమపై బురద జల్లేవిధంగా వ్యవహరించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. అనంతరం టంపరగుడ గ్రామస్తులతో కలిసి జితు జకసికపై ఫిర్యాదు చేశారు.

ముగిసిన ఉత్సవాలు



బలిజాత్రలో పూజించే మొలకలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ పరిధి హరిదాస్‌పూర్‌లో ఉత్సవాలు ముగిశాయి. వారం రోజులుగా గ్రామ ప్రజలు సాంప్రదాయబద్ధంగా చేపడుతున్న బలిజాత్ర పూజలను బుధవారంతో ముగించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలంతా ధింసా నృత్యం చేశారు. పంటలు పుష్కలంగా పండాలని, ఎటువంటి దుష్టశక్తులు తమ గ్రామంలోకి ప్రవేశించకూడదని ఇష్టదైవాన్ని పూజిస్తారు. పండగ ప్రారంభం రోజున ఒక దగ్గర తాము పండించిన ధాన్యాన్ని కొంచెం వేస్తారు. వారం రోజుల్లో అవి మొలకెత్తుతాయి. వీటిని వారు దైవంగా భావించి పూజిస్తారు. అనంతరం వాటిని సమీపంలోని నదిలో నిమజ్జనం చేస్తారు.



ధింసా నృత్యం చేస్తున్న దృశ్యం

రథయాత్రకు సన్నాహాలు



రథం తయారీలో నిమగ్నమైన కార్మికులు

రాయగడ: జూన్ 27వ తేదీన జరగనున్న రథయాత్రకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. స్థానిక జగన్నాథ మందిరానికి సమీపంలో రథం తయారీకి శ్రీకారం చుట్టారు. తన్మయ మహారణ, బలరాం బగర్తీ పర్యవేక్షణలో రథ నిర్మాణం పనులు ఊపందుకున్నాయి. ప్రతీ ఏడాది రథయాత్రకు పాత కలపతో పాటు కొత్త కలపను వినియోగిస్తుండడం ఇక్కడ ఆనవాయితీ. దానికి అనుగుణంగా రథాల తయారీకి రంగం సిద్ధమైంది.



పాత కలపను బయటకు తీస్తున్న దృశ్యం

ఆక్రమణలు తొలగింపు



ఆందోళన తెలుపుతున్న ఆక్రమణదారులు

జయపురం: మున్సిపాలిటీ పరిధిలోని జయనగర్ నుంచి భూతనాథ్ మందిరం వరకు ఉన్నటువంటి రహదారిని వెడల్పు చేసే కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. రహదారికి ఇరువైపులా స్థలాన్ని ఆక్రమించి షాపులు, ఇళ్లు నిర్మించినవారు అభ్యంతరం తెలిపినా అధికారులు తమ పని తాము చేసుకుపోయారు. అధికారుల వివరణ మేరకు జయనగర్–భూతనాథ్ మందిరం రహదారిని 40 అడుగుల వెడల్పు రోడ్డుగా ఏర్పాటు చేసేందుకు ఈనెల 2వ తేదీన మార్కింగ్ చేశారు. మార్కింగ్ ప్రకారం ఆక్రమణలు తొలగించమని 65 మందికి నోటీసులు జారీ చేశారు. అయితే వారు స్పందించకపోవడంతో జేసీబీలతో తొలగింపు చేపట్టారు. సబ్ కలెక్టర్ అక్కవరం శౌర్యారెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కార్యనిర్వాహక అధికారి కృతిబాష్ సాహు, ప్రభుత్వ ఇంజినీర్ అజయ కుమార్ జాని, రెవెన్యూ అధికారి హరిర శతపతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న సబ్ కలెక్టర్ శౌర్యారెడ్డి తదితరులు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

నరేంద్ర పుష్కరిణిలో యువకుడు మృతి


నరేంద్ర పుష్కరిణిలో గాలిస్తున్న అగ్నిమాపక దళం

భువనేశ్వర్: పూరీలోని పవిత్ర నరేంద్ర పుష్కరిణిలో బుధవారం మధ్యాహ్నం విషాద సంఘటన చోటుచేసుకుంది. స్నానం చేస్తుండగా ఒక యువకుడు మునిగిపోయాడు. అతని వివరాలు తెలియాల్సి ఉంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఆ యువకుడు వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం స్నానం చేయడానికి పుష్కరిణిలోకి దిగాడు. తిరిగి ఒడ్డుకు చేరుకోలేక సతమతం అయ్యాడు. ఈ విషయం స్థానికులు అగ్నిమాపక దళానికి తెలియజేశారు. వారు పుష్కరిణిలో గాలింపు చర్య నిర్వహించి నీట మునిగిన యువకుడిని ఒడ్డుకు చేర్చారు. తక్షణమే పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని తీసుకుని వచ్చినట్లు అక్కడి వైద్యులు ప్రకటించారు. గతేడాది ఇలాంటి రెండు సంఘటనలు నమోదు అయ్యాయి.

ఆకాశవాణి ఏ-గ్రేడ్ ఆర్టిస్ట్‌గా సత్యవరప్రసాద్

కవిటి: బెనారస్ హిందూ యూనివర్సిటీలో మృదంగం విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ బొంతలకోటి సత్యవరప్రసాద్ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఇటీవల నిర్వహించిన ఆడిషన్‌లో ఏ-గ్రేడ్ ఆర్టిస్ట్‌గా అర్హత సాధించారు. ఈ మేరకు హైదరాబాద్ ఆకాశవాణి కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయని సత్యవరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వగ్రామం కవిటి మండలం కుసుంపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నారాయణపురం ఆయకట్టుకు నిధులు మంజూరు

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్‌లో సాగునీటి సమస్య పరిష్కారానికి నారాయణపురం ఆయకట్టుకు రూ.34.63 లక్షల నిధులను జలవనరులు శాఖ అధికారులు మంజూరు చేశారు. జంగిల్ క్లియరెన్స్, ఇసుక పొరల తొలగింపు, షట్టర్లు, మదుముల మరమ్మతులకు ఈ నిధులు వినియోగిస్తారు. సజావుగా సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక వాహనాలు సీజ్



అధికారులకు పట్టుబడిన వాహనాలు

కొత్తూరు: మండలంలోని అంగూరు ఇసుక ర్యాంపు(ఆకులతంపర) వద్ద బుధవారం జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నట్లు తహశీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు. నది మధ్యలో అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్న ప్రొక్లెయిన్, జేసీబీ, లారీలు, ట్రిప్పర్లు మొత్తం ఆరు వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు.

ఉపాధి వేతనదారుడికి పాముకాటు

మెళియాపుట్టి: మండలంలోని చాపర పంచాయతీలో పరిధిలో బుధవారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తుండగా డోల అప్పడు అనే 60 ఏళ్ల వృద్ధుడు పాముకాటుకు గురయ్యాడు. వెంటనే తోటి వేతనదారులు ఫీల్డ్ అసిస్టెంట్ సింహాచలంకు తెలియజేయడంతో హుటాహుటిన పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వృద్ధుడి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ/ఇచ్ఛాపురం : ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని సుర్లా రోడ్డు రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస జీ.ఆర్.పి. పోలీసుస్టేషన్ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇచ్ఛాపురం-సుర్లారోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య ఎగువ లైనులో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుందని చెప్పారు. మృతుడి వయసు 55-60 ఏళ్లు ఉండవచ్చని, కాషాయ రంగు టీషర్టు, ఆకుపచ్చ లుంగీ ధరించి ఉన్నాడని, చేతి కర్ర, సంచి ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు 9440627567 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

55 పశువులు పట్టివేత

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలో రామతీర్థాలు కూడలి వద్ద జాతీయ రహదారిపై ఐదు బొలెరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 55 పశువులను జె.ఆర్.పురం పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని పలు గ్రామాల నుంచి విశాఖపట్నం గోవధశాలకు తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 9 మందిపై కేసు నమోదు చేశారు. పశువులను విజయనగరం జిల్లా గుజ్జంగివలసలోని గో-సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.


రాయగడ: వర్షంతో మెయిన్ రోడ్డులో పరిస్థితి

కుండపోత వర్షం

పర్లాకిమిడి: పట్టణంలోని బుధవారం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల వరకు కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. పలుచోట్ల చెట్లు కూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

రాయగడ: పట్టణంలో బుధవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక ఎస్‌బీఐ, మెయిన్ రోడ్డులు నీటితో మునిగిపోయాయి. సుమారు గంటన్నర పాటు వర్షం కుండపోతగా కురవడంతో ఉక్కపోతతో సతమతమవుతున్న పట్టణ వాసులకు ఊరట కలిగింది.


పర్లాకిమిడిలో కురుస్తున్న వర్షం

ఎస్ఈబీసీ విద్యార్థులకు రిజర్వేషన్ల ప్రకటన


మంత్రి మండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ మాఝి ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాల్లో ఎస్ఈబీసీ విద్యార్థులకు 11.25 శాతం రిజర్వేషన్లు ప్రకటించారు. బుధవారం ఆయన అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థల్లో ప్రవేశాల్లో సామాజికంగా మరియు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఎస్ఈబీసీ) విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించింది. ఈ నిర్ణయంతో ఎస్ఈబీసీ కేటగిరీ విద్యార్థులు ప్రవేశాల్లో 11.25 శాతం సీట్ల రిజర్వేషన్ పొందుతారు. ఈ విధానం ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి అమలు చేయబడుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. మంత్రి మండలి తాజా తీర్మానంతో విద్యా సంస్థల్లో సమగ్ర రిజర్వేషను పరిమితి 56 శాతానికి చేరింది.

వర్గాలవారీగా రిజర్వేషన్ వివరాలు	
షెడ్యూల్డ్ తెగలు	22.5 శాతం
షెడ్యూల్డ్ కులాలు	16.25 శాతం
ఎస్ఈబీసీ	11.25 శాతం
పీడబ్ల్యూడీ	5 శాతం
ఈఎస్ఎం	1 శాతం

సమస్యలు పరిష్కరిస్తే సహకరిస్తాం

జయపురం: తమ సమస్యలు పరిష్కరిస్తేనే యాజమాన్యానికి సహకరిస్తామని గగణాపూర్ సేవా పేపరు మిల్లు రెండు కార్మిక యూనియన్ల నేతలు స్పష్టం చేశారు. బుధవారం ప్రథమ, ద్వితీయ యూనియన్ల నేతలు జిల్లా జాయింట్ లేబర్ కమిషనర్ బృందావన సెట్టికి, జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. 2020 ఫిబ్రవరి 26వ తేదీన మిల్లు అమ్మకం సమయంలో జరిగిన బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ ప్రకారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో మిల్లులోని నాలుగు యూనియన్లు కలిసి ఒక వర్కింగ్ కమిటీ ఆఫ్ యూనియన్స్‌గా ఏర్పడి సమస్యల పరిష్కారానికి పోరాడామన్నారు. అయితే ప్రస్తుతం యాజమాన్యం రెండు యూనియన్లతో కార్మికులను పీడిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో కార్మిక నేతలు ప్రదీప్ పంజియ, సరోజ్ సువార్, వంశీధర మహంకుడో, కె.సత్యనారాయణ, అలేక్ పాత్రో, ఉమా శతపతి, రోహిత్ థోమస్ తదితరులు పాల్గొన్నారు.


లేబర్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మోసపోయిన చార్‌ధామ్ యాత్రికులు

కాశీబుగ్గ : కాశీబుగ్గకు చెందిన పలువురు యాత్రికులు ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు వెళ్లి ఓ ట్రావెల్ ఏజెన్సీ చేతిలో మోసపోయారు. వీరంతా గంగోత్రిని సందర్శించిన అనంతరం యాత్రికులు కేదార్ లోయకు వెళ్లారు. ప్రయాణ ప్యాకేజీ, హెలికాప్టర్ టికెట్‌కు ఒక్కొక్కరి నుంచి రూ.30 వేలు చెల్లించినప్పటికీ హెలికాప్టర్ ఎక్కించలేదని యాత్రికులు వాపోయారు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎక్కడి వాహనాలు అక్కడే..


కొత్తరోడ్డు నుంచి నందగిరిపేట వరకు నిలిచిన వాహనాలు


వాహనచోదకులకు తప్పని ఇక్కట్లు

- కొత్తరోడ్డు-నందగిరిపేట మధ్య ట్రాఫిక్ జామ్
- వందల సంఖ్యలో నిలిచిన వాహనాలు
- ఎండలో ప్రజల నరకయాతన

ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్: జిల్లాలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన శ్రీకాకుళం-పాలకొండ-పార్వతీపురం రహదారి బుధవారం స్తంభించిపోయింది. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు నాలుగు లైన్ల రోడ్లుగా ఇటీవల అభివృద్ధి చెందుతున్న ఈ రహదారిలో పలుచోట్ల కల్వర్టుల నిర్మాణం జరుగుతోంది. ఇదే క్రమంలో ఆయా గ్రామాల పరిధిలో అమ్మవార్ల పండగలు బుధవారం జరగడంతో భారీగా జనం తరలివచ్చారు. ఈ క్రమంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ముఖ్యంగా కొత్త రోడ్డు సమీపంలోని చర్చి వద్ద ఉన్న ప్రధాన కాలువ కల్వర్టు పనులు కొన్నాళ్లుగా నిలిచిపోవడంతో ఇక్కడ నిత్యం వాహనాలు నిలిచిపోతున్నాయి. రాయిపాడు జంక్షన్ వద్ద కల్వర్టు ఒకవైపు తవ్వకాలు జరపటం చర్చి వద్ద ఉన్న కల్వర్టు ప్రాంత పక్క రహదారిని మూసివేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇదే రహదారి సమీపంలో ఆమదాలవలస మండలం వంజంగి, గట్టుముడిపేట గ్రామాల్లో అమ్మవారి పండుగలు నిర్వహించడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో జనం తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి కొత్త రోడ్డు ప్రాంతం నుంచి నందగిరిపేట వరకు ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. బస్సులు, లారీలు, కార్లలో గంటల తరబడి ఉండిపోయారు. ఆసుపత్రులకు రోగులను తరలించే అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. సుమారు మూడు గంటల పాటు ద్విచక్ర వాహనచోదకులు నరకయాతన అనుభవించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రధాన రహదారిపైకి వచ్చి భారీ వాహనాలను కొత్త రోడ్డు నుంచి సింగుపురం వైపు చింతాడ మీదుగా తరలించడంతో కొంతమేర ఊరట లభించింది.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్ : మద్యానికి బానిసై చిలకపాలెం గ్రామానికి చెందిన సారిపల్లి జనార్దన్ (31) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనార్దన్ ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. భార్య ధనలక్ష్మి, కుమారుడు ఉన్నారు. జనార్దన్ రోజు సంపాదన మొత్తం మద్యం తాగేందుకే ఖర్చు చేస్తుండటంతో కొన్నాళ్లుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల క్షయ వ్యాధి రావటంతో మందులు వాడుతున్నాడు.అయినా మద్యం ఆపకపోవడంతో భార్య ధనలక్ష్మి గొడవపడి బుధవారం శ్రీకాకుళంలో షాపులో పనికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన జనార్దన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన భార్య భర్త మృతి చెందిన విషయం గమనించి ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

20న అఖిల భారత సమ్మె

రణస్థలం: కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణ కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం రణస్థలంలో సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం పెంచాలని, కనీస పెన్షన్ రూ. 9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని, పని భారం తగ్గించాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు కె.సుజాత, పెద్దింటి కాంతమ్మ, ఎస్.జయలక్ష్మి, బి.గౌరి, కెల్ల ఉషా, ఎం.అన్నపూర్ణ, ఎ.అరుణ పాల్గొన్నారు.

ఉపాధిలో జియో ట్యాగింగ్ కీలకం

మెళియాపుట్టి: ఉపాధి హామీ పథకంలో జియో ట్యాగింగ్ విధానం కీలకమైనదని, దానికి అనుగుణంగా పనులు నిర్వహించాలని జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి వి.సుగుణాకరరావు అన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి మెళియాపుట్టి వచ్చిన ఆయన స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో నిర్మించిన రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భజలాల పరిరక్షణ ఇటువంటి నిర్మాణాలు మరిన్ని చేపట్టాలన్నారు. అనంతరం గోకర్ణపురంలో పంట కుంటను పరిశీలించారు. అంతకుముందు స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా జీఐఎస్ అధికారి శోభ, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు తిరుపతిరావు, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రబీ వరి కొనుగోళ్లు ప్రారంభం


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న మంత్రి కృష్ణచంద్ర పాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో బుధవారం నుంచి రబీ వరి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర రైతుల ప్రయోజనాల పరిరక్షణ చర్యల్లో భాగంగా వరి సేకరణ సమయంలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు వస్తే సత్వర చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో అధికారులకు ఆదేశించారు. వరి కొనుగోళ్లు ఆరంభం పురస్కరించుకుని ఆయన రాష్ట్ర ఆహార సరఫరా సంస్థ సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు. మండిల్లో వరి సేకరణ ప్రక్రియ, సీసీ టీవీ వ్యవస్థ పర్యవేక్షణ, మండి నుంచి మిల్లుకు వెళ్లే వాహనాలను ట్రాక్ చేయడం, అనుబంధ ప్రత్యక్ష ఫుటేజ్ ఏర్పాటును మంత్రి పర్యవేక్షించారు. మండిల్లో రైతులు మరియు నోడల్ అధికారులతో మంత్రి సంభాషించి వారి సౌకర్యాలు మరియు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1967 ద్వారా సంప్రదించాలని అవగాహన కల్పించారు. వరి సేకరణకు సంబంధించి ఏ రైతు నుంచి అయినా ఫిర్యాదు అందితే దాన్ని తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను ఆదేశించారు.

పిల్లలకు విషమిచ్చి తండ్రి ఆత్మహత్యాయత్నం


మరణించిన బిజయానంద పాణిగ్రాహి


చికిత్స పొందుతున్న తండ్రి శుభాషిష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి, తాను విషంతాగి తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని రెండో వార్డు పరలా వీధిలో నివాసముంటున్న శుభాషిస్ పాణిగ్రాహి బుధవారం ఉదయం ఏదో కారణం వలన తన కుమార్తె ప్రియదర్శినీ పాణిగ్రాహి (11), కుమారుడు బిజయానంద పాణిగ్రాహి (7)లకు విషం ఇచ్చాడు. అనంతరం తానుకూడా విషం సేవించాడు. వీరు మధ్యాహ్నం వరకు బయటకు రాకపోవడంతో పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి చూడగా ఇంటిలో విషంతాగి అచేతనంగా నురగలు కక్కుతూ ముగ్గురూ పడి ఉండడం గమనించి స్థానిక ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కుమారుడు బిజయనందన్ పాణిగ్రాహి మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. అయితే తండ్రి శుభాషిస్, కూతురు ప్రియదర్శినీ ఆరోగ్యం విషమించడంతో బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలియజేశారు. ఇంతకుముందు శుభాషిస్ భార్య కుటుంబ కలహాల వలన మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్దాన విధ్వంసాన్ని సహించేది లేదు


కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్:

ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి పచ్చని ఉద్దాన ప్రాంతంలో విధ్వంసానికి పాల్పడితే సహించేది లేదని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరులో బుధవారం కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుపచ్చ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, కార్గో ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ప్రజల భూములను బలవంతంగా లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి ప్రజలను నిరాశ్రయులుగా చేయడం సరికాదన్నారు. ఉద్దాన ప్రాంతంలో కొబ్బరి, జీడిపంటలను నమ్ముకొని వేలాది మంది ప్రజలు జీవనోపాధి సాగిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మేలును ఆకాంక్షిస్తే వెంటనే కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఉద్దాన ప్రజలకు మేలు కలిగించే ఉద్దాన పంటల ఆధారిత పరిశ్రమలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు.

నాయకులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే ముందుగా ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకొని ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు, శివారు భూములకు సాగునీరు అందించే పనులపై దృష్టిపెట్టాలన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మౌనం వీడి ఉద్దాన ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో జీడి రైతు పోరాట కమిటీ అధ్యక్షుడు తెప్పల అజయ్‌కుమార్, రైతు సంఘ జిల్లా కార్యదర్శి కోనారి మోహన్‌రావు, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, సీఐటీయూ నాయకులు ఎన్.గణపతి, కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక కమిటీ నాయకులు కుసుమ, దానేష్, చలపతి, పి.అరుణ, ధర్మారావు, జోగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా.. తవ్వేస్తున్నారు!

- గోవిందపురం కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలింపు
- అనుమతులు లేకపోయినా టిప్పర్ల ద్వారా రవాణా
- ఇదేంటని ప్రశ్నించిన సర్పంచ్‌పై దురుసు ప్రవర్తన


కొండను తవ్వి గ్రావెల్ లోడ్ చేస్తున్న దృశ్యం


టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

సంతబొమ్మాళి: మండలంలోని గోవిందపురం సర్వే నెంబర్ 71లో కొండపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రెవెన్యూ, పంచాయతీ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకపోయినా దౌర్జన్యంగా టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. లక్షల రూపాయలను సొమ్ముచేసుకుంటున్నారు. అక్రమ తరలింపుపై ప్రశ్నించిన స్థానిక సర్పంచ్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు నిర్వాహకులు విశ్వసముద్రం సంస్థ ద్వారా మూలపేట పోర్టు పనులకు గ్రావెల్‌ను తరలిస్తున్నామని చెబుతున్నారు. ఆర్డర్ కాపీ చూపించాలని కోరగా..ఆర్డీవో వద్దకు వెళ్లి అడగండంటూ దురుసుగా సమాధానం ఇస్తున్నారు. వాస్తవానికి సర్వే నెంబర్ 71లో ఉన్న ఈ కొండను గ్రామానికి చెందిన మండపాక నర్సింగరావు 2020-30 సంవత్సరం వరకు లీజుకు తీసుకున్నారు. ఏటా హెక్టార్‌కు రూ.65వేలు ప్రభుత్వానికి చెల్లిస్తున్నట్లు లీజుదారు చెబుతున్నారు. తనకు లీజుకిచ్చిన గ్రావెల్ కొండను ఇతరులు తరలించుకుపోతున్నారని జిల్లా మైన్స్ విజిలెన్స్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఈ మేరకు మంగళవారం ఏడీ అశోక్ వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ టిప్పర్లను సీజ్ చేయాలని పోలీసులకు ఆదేశించారు. సీజ్ చేసిన గంటలోపే మళ్లీ గ్రావెల్‌ను తరలించే ప్రక్రియ ప్రారంభం కావడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోర్టు పేరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ గ్రావెల్‌ను తరలించుకుపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

న్యాయపోరాటం తప్పదు..

కింజరాపు కుటుంబీకుల కనుసన్నల్లోనే గ్రావెల్‌ను ఎటువంటి అనుమతులు లేకుండా తరలించుకుపోతున్నారు. లీజుదారుడైన నన్ను సంప్రదించకుండా దౌర్జన్యంగా గ్రావెల్ తీసుకెళ్తున్నారు. జిల్లా మైన్స్ విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై న్యాయపోరాటం చేస్తాను.

– మండపాక నర్సింగరావు, లీజుదారుడు, వల్లేవలస

దురుసుగా సమాధానం..

అక్రమంగా గ్రావెల్ తరలించుకుపోవడంతో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లాను. మీకు ఎటువంటి అనుమతులు ఉన్నాయో పత్రాలు చూపించండని కోరాం. ఆర్డీవో దగ్గర పర్మిషన్ ఆర్డర్ ఉంది వెళ్లి చూసుకోండి అంటూ దురుసుగా సమాధానం ఇచ్చారు.

– ఆర్.రామిరెడ్డి, సర్పంచ్, గోవిందపురం

క్లుప్తంగా

వెటర్నరీ కళాశాలలో వీసీఐ బృందం పర్యవేక్షణ



కళాశాలలో భవన సముదాయాలు, సౌకర్యాలపై వివరాలను తెలుసుకుంటున్న బృందం సభ్యులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(వీసీఐ) బృందం సభ్యులు బుధవారం పర్యవేక్షించారు. గుజరాత్ రాష్ట్రంలోని కామధేను యూనివర్సిటీ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి.యమ్.లునగారియా, ఒడిశా వెటర్నరీ కళాశాల నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డా.అంబికాప్రసాద్ కె.మహాపాత్ర, మహారాష్ట్ర వెటర్నరీ కళాశాల నుంచి డా.ప్రతిభా జండేతో కూడిన బృందం కళాశాలను సందర్శించింది. ఈ సందర్శనలో భాగంగా కళాశాలలో నిర్మించిన భవన సముదాయాన్ని బృందంసభ్యులు పర్యవేక్షించారు. విద్యార్థులకు సరిపడా తరగతి భవనాలు సక్రమంగా అందుబాటులో ఉన్నదీ లేనిదీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ భవనాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. కళాశాలలో మరో రెండు రోజుల పాటు పర్యవేక్షణ చేయనున్నారు. పర్యవేక్షణలో కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను పాల్గొన్నారు.

డీఈఓకు ఎస్టీయూ జిల్లా కమిటీ వినతి



వినతిపత్రాన్ని అందుకుంటున్న డీఈఓ మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్: ప్రభుత్వం తాజాగా ప్రకటించిన టీచర్ల బదిలీ ప్రక్రియలోని అసంబద్ధ నిబంధనలను సడలించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు బుధవారం డీఈఓ యూ.మాణిక్యంనాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2021, 2023వ సంవత్సరంలో రేషనలైజేషన్‌కు గురైన పీఎస్‌హెచ్‌ఎంలకు 2021వ సంవత్సరం ముందు పనిచేసిన 'ఓల్డ్ స్టేషన్ పాయింట్'ను మంజూరు చేయాలని కోరారు. గత నెల 24, 25, 26 తేదీన వైద్య ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు హాజరుకాలేకపోయిన ఉపాధ్యాయులకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. టిస్‌లో ఉన్న తప్పుల సవరణకు ఎంఈఓలకు అవకాశం కల్పించాలని సూచించారు. ప్రిఫరెన్స్ కేటగిరి ఉన్న ఉపాధ్యాయులకు వారికి ఇష్టమైన మోడల్ ప్రైమరీ పాఠశాలలకు వెళ్లే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంగా ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు, ప్రధాన కార్యదర్శి చిప్పాడ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యం



గురజాడ స్వగృహంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి దేశభక్తి గీతాలాపన చేస్తున్న సంస్థ ప్రతినిధులు, చిన్నారులు

విజయనగరం టౌన్: విద్యార్థులకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు, సమాజం పట్ల అవగాహన పెంపొందించే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి అన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు నైతిక విలువలు, సంస్కృతీ, సంప్రదాయాలు పట్ల కనీస అవగాహన లేకుండా పోయిందని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటూ వినయం, సంస్కారం నేర్పించేందుకు వాగ్దేవీ సమారాధనం, తెలుగు భాషా పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ స్వగృహంలో చేపట్టిన వేసవి ఉచిత శిక్షణ తరగతులను బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాగ్దేవీ బాల సంస్కార శిక్షణ తరగతులకు విద్యార్థులను తల్లిదండ్రులు తప్పనిసరిగా పంపించాలని కోరారు. సంస్కారవంతమైన విద్యతోనే పరిపూర్ణ సమాజం సాధ్యమవుతుందని తెలుగు భాషా పరిరక్షణ సమితి కార్యదర్శి డాక్టర్ జక్కు రామకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శతక పద్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహాకవి గురజాడ అప్పారావు జీవిత విశేషాలను, సాహిత్య వైభవాన్ని గురజాడ ఇందిర వివరించారు. కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, టేకుమళ్ల విజయలలిత, రవికుమార్ ఆచార్యులు, రాంభట్ల సన్యాసిరాజు శర్మ, పప్పు సావిత్రి, రేపల్లె ఈశ్వరరావు, మానాప్రగడ వంశీ తదితరులు పాల్గొన్నారు.

నిధుల జాడెక్కడ..?

- ఏడాదిగా ఏరియా ఆస్పత్రికి తప్పనికష్టాలు
- గత ప్రభుత్వంలో రూ.28 కోట్లు మంజూరు



చీపురుపల్లి ఏరియా ఆస్పత్రి

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడేందుకు ఎన్నికలు జరిగి సరిగ్గా ఏడాదైంది. ప్రజలంతా ఓట్లు వేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇదంతా జరిగి ఏడాది కావస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఏదైనా అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన జరిగిందా? అంటే శూన్యమనే చెప్పుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం పడకేశాయనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. దీనికి నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లిలో గల ఏరియా ఆస్పత్రి ప్రధాన ఉదాహరణగా నిలుస్తుంది. ఎన్నికల ముందు గత ప్రభుత్వ హయాంలో యాభై పడకల ఆస్పత్రి నుంచి వంద పడకల ఆస్పత్రిగా ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నప్పటికీ అప్పుడెలా ఉందో ఇప్పుడూ అలాగే ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ (సీహెచ్‌సీ)లను ఏరియా ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేయడమే కాకుండా ప్రతి సచివాలయం పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంతో పాటు పల్లెల్లోనూ పేదలకు ఆరోగ్య సేవలు విరివిగా అందేవి. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ వైద్య వ్యవస్థపై కనీసం దృష్టి సారించకుండా నిర్వీర్యం చేసిందని పలువురు విమర్శిస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ.28 కోట్ల నిధులు

ఇదిలా ఉండగా యాభై పడకల సీహెచ్‌సీగా ఉన్న స్థానిక ఆస్పత్రిని గత ప్రభుత్వంలో వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. దీనికోసం వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది పోస్టులతో బాటు మౌలిక వసతుల కల్పన కోసం రూ.28 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో వంద పడకల ఆస్పత్రి అభివృద్ధి కోసం అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన కూడా చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభం కాలేదు.

ఎమ్మెల్యే దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా..

పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి మంజూరు కావాల్సిన నిధుల విషయాన్ని ఇప్పటికే పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు దృష్టికి ఆస్పత్రి వర్గాలు తీసుకువెళ్లాయి. ఆరు నెలల క్రితం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కళా వెంకటరావు నేతృత్వంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలోనూ, ఇటీవల రెండు నెలల క్రితం ఏరియా ఆస్పత్రిలో జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలోనూ ఇదే అంశాన్ని ప్రధానంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. కానీ ఇంతవరకు ఎలాంటి పురోగతి లేకపోవడం శోచనీయం.

కూటమి ప్రభుత్వం కినుక..

వంద పడకల ఏరియా ఆస్పత్రి మౌలిక వసతుల కల్పన కోసం మంజూరైన నిధులకు సంబంధించి జీవో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంతవరకు నిధుల విడుదలలో పురోగతి కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీని పుణ్యమాని స్థానిక ఏరియా ఆస్పత్రి పేరుకే వంద పడకల ఆస్పత్రి అయినప్పటికీ ఉన్నవి మాత్రం యాభై పడకలు మాత్రమేనని పలువురు చర్చించుకుంటున్నారు. నిరంతరం వందల సంఖ్యలో రోగుల తాకిడి ఉండే స్థానిక ఏరియా ఆస్పత్రికి నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

ఇంకా నిధులు రాలేదు....

ఏరియా ఆస్పత్రిలో వంద పడకలతో పాటు ఇతర మౌలిక వసతుల కల్పన కోసం నిధులు రావాల్సి ఉంది. ఏరియా ఆస్పత్రిలో భాగంగా వైద్యులు పోస్టులు నిండాయని ఇంకా స్టాఫ్ నర్సుల పోస్టులు రావాల్సి ఉంది. తాజాగా కౌన్సెలింగ్ జరుగుతున్న నేపథ్యంలో స్టాఫ్‌నర్సు పోస్టులు కూడా భర్తీ కానున్నాయి.

– డా.సుధీర్, సూపరెండెంట్, ఏరియా ఆస్పత్రి, చీపురుపల్లి

ప్రతి నెలా అనీమియా కమిటీ సమావేశం

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలోని ప్రతి సచివాలయం పరిధిలో అనీమియా యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఇకపై ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులకు స్పష్టం చేశారు. కమిటీ సమావేశంలో తీసుకున్న చర్యలు, తద్వారా వచ్చిన ఫలితాలపై ఇక నుంచి సమీక్షిస్తానని తేల్చిచెప్పారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఇతర జిల్లా అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. జిల్లాలో కొత్తగా నిర్మించి అసంపూర్తిగా ఉన్న సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, బీహెచ్‌పీయులను వినియోగంలోకి తీసుకురావాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ప్రధానంగా సీతానగరం, మామిడిపల్లి, శంబర పీహెచ్‌సీలో పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని, మిగిలిన భవనాలను కూడా వీలైనంత త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. చిన్న చిన్న పనులు జరగక భవనాలు నిరుపయోగంగా ఉండడం సబబు కాదని, ప్రభుత్వం తప్పక నిధులు విడుదల చేస్తుందనే భరోసా కల్పించి ఆయా కాంట్రాక్టర్లతో పనులు త్వరగా చేయించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో మలేరియా కేసులు ఉండకూడదు

జిల్లాలో మలేరియా కేసులు ఉండడానికి వీల్లేదని, పోలియో, ఎయిడ్స్ మాదిరిగా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించి మలేరియా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మండల స్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మలేరియా కేసులు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి వారం తాగునీటి ట్యాంకులను పరిశీలించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అన్నారు. రోగుల పట్ల వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్ మోహనరావు, డీసీహెచ్‌ఎస్ డా.బి.వాగ్దేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డా.కె.విజయపార్వతి, డా.పద్మావతి, డీఆర్డీఏ పీడీ ఎం.సుధారాణి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.చలపతిరావు, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల వైద్యాధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీలో గంజాయి డాన్..!

- వివరాలు సేకరిస్తున్న పోలీసులు



కారులో ఉన్న గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

రామభద్రపురం: గంజాయి అక్రమరవాణా చేస్తున్న వ్యక్తులపై సీఐ కె నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావు ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ డాన్‌గా పేరున్న వ్యక్తి, కొట్టక్కి పోలీస్ చెక్ పోస్టు వద్ద కారులో అక్రమంగా గంజాయి తరలింపునకు కారకుడైన ప్రధాన నిందితుడు రామభద్రపురం పోలీసుల కస్టడీలో ఉన్నట్లు తెలిసింది. ఈ నిందితుడు గంజాయి అక్రమరవాణాలో పట్టుబడడంతో రామభద్రపురంతో పాటు ఎస్‌కోట, సాలూరు, కొత్తవలస, పాచిపెంట తదితర పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు సమాచారం ఉంది.అయితే విశాఖ సెంట్రల్ జైల్‌లో ఉన్న ప్రధాన నిందితుడిని హుకుంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి పీపీ వారెంట్‌పై రామభద్రపురం పోలీస్ కస్టడీకి తీసుకొచ్చి పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రథమ నిందితుడు అనంతగిరి చెందిన వ్యక్తిగా తెలిసింది. కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో ఫిబ్రవరి 10 వతేదీ రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో వాహనాలు చెక్ చేస్తున్నారు. ఇంతలో వాహనాల వెనుకన ఒడిశా నుంచి అక్రమంగా ఒడిశా నుంచి 150 కిలోల గంజాయిని తరలిస్తున్న డస్టర్ కారు డ్రైవర్ కారును జాతీయ రహదారి పక్కన చిన్న రూట్‌లో తప్పించి స్పీడ్‌గా లాగించేశాడు. దీంతో అప్రమత్తమైన ఏఎస్సై అప్పారావు, పోలీస్ సిబ్బంది వెంటాడారు. సరిగ్గా కొట్టక్కి దుర్గమ్మ గుడి వద్దకు వెళ్లేసరికి సరిగా దారి కనిపించకపోవడంతో కారు వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. ఈ నేపథ్యంలో కారును, అందులో ఉన్న 150 కిలోల గంజాయి(74 ప్యాకెట్లు)ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులు ఉన్నట్లు విచారణలో తేలగా ఇప్పటివరకు నలుగురిని అరెస్టు చేశారు.

• సారా స్వాధీనం



సారా రవాణా చేస్తూ పట్టుబడిన వ్యక్తితో రైల్వే పోలీస్ అధికారులు

పార్వతీపురం రూరల్: ఒడిశాకు చెందిన యువకుడు సారా ప్యాకెట్లను తరలిస్తుండగా పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకుని 150 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా పారిపోతున్న ఒడిశాకు చెందిన టి. నరేంద్రను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.4,500 విలువ చేసే సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాయగడ నుంచి రోడ్డు మార్గం ద్వారా వచ్చి పార్వతీపురం రైల్వే స్టేషన్ నుంచి రైళ్లల్లో విజయనగరం వరకు రవాణా చేసేందుకు ఎదురు చూస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గంజాయి, సారా, హాని కలిగించే మాదకద్రవ్యాలు రైలు మార్గం ద్వారా రవాణా జరగకుండా నిరోధించడానికి నిరంతరం గస్తీని ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ రత్నకుమార్, తదితర సిబ్బంది ఉన్నారు.

26లోగా వాహనాలను రిలీజ్ చేసుకోవాలి

విజయనగరం టౌన్: రవాణాశాఖ తనిఖీ అధికారులు సీజ్ చేసిన వాహనాలకు నోటీసుల ద్వారా అపరాధరుసుం, టాక్స్ బకాయిలు కట్టాలని ఇప్పటికే తెలియపర్చామని, వాటి యజమానులు, ఫైనాన్షియర్స్ స్పందించకపోవడంతో ఈ నెలలో వాహనాలను వేలం వేయనున్నామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలు ఆర్‌టీఓ కార్యాలయం, ఆర్టీసీ డిపోలో ఉన్నాయన్నారు. ఈ నెల 26లోగా వాహనాలు రిలీజ్ చేసుకోవాలని, లేకుంటే ఎటువంటి సమాచారం లేకుండానే 27న వేలం వేయనున్నామని స్పష్టం చేశారు. వేలంలో వాహనాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్నవారు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆధ్వర్యంలో వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో 3 ఏళ్ల డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఓఎస్‌డీ ఎస్.గిరిధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థలో 53 సీట్లు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లు, కర్నాటకలోని గడగ్‌లో 4 సీట్లకు ప్రవేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఈ ఏడాది జూలై 1 నాటికి 23 ఏళ్లలోపు వయస్సు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 సంవత్సరాల వరకు సడలింపు ఉందని తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, ఒకేషనల్ (టెక్స్‌టైల్స్), ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సు ఉత్తీర్ణులైన వారు ఈ డిప్లమో కోర్సులో నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అపేరల్, గార్మెంట్ మేకింగ్ టెక్నాలజీలో ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. దరఖాస్తులు, ఇతర వివరాల కోసం 'ఐఐహెచ్‌టీవీజీఆర్.కాం' వెబ్ సైట్ లేదా ఫోన్ 08625–295003, 9399936872, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

పిడుగుపాటుకు ఎనిమిది గొర్రెల మృతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద్ద బూరాడపేట సమీపంలో సోమవారం మధ్యాహ్నం పిడుగులు బీభత్సం సృష్టించాయి. పిడుగుపాటుకు గ్రామానికి చెందిన డొప్ప త్రినాథ్ అనే రైతుకు చెందిన ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సమీప పొలాల్లో గొర్రెలు మేత మేస్తుండగా ఆకస్మాత్తుగా పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. గొర్రెలు మేత మేస్తున్న సమయంలో పిడుగు పడడంతో ఎనిమిది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.80వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు త్రినాథ్ వాపోయాడు.



పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

రైతును వెంటాడుతున్న దురదృష్టం

బూరాడపేటకు చెందిన రైతు డొప్ప త్రినాథ్‌ను దురదృష్టం వెంటాడుతోంది. సుమారు ఐదు నెలల క్రితం ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షానికి పొలంలో రాలిన ధాన్యం గింజలను మేయడంతో సుమారు 100కు పైగా గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ధాన్యాన్ని జీర్ణించుకోలేకపోవడంతో గొర్రెలు మృతి చెందాయి. అప్పట్లో సుమారు రూ.10లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ఆ బాధ నుంచి తేరుకోకుండానే మళ్లీ పిడుగు రూపంలో ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. దీంతో బాధిత కుటుంబసభ్యులు తీవ్రంగా రోదించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

ఈశ్వరమ్మ కంటకన్నీరు



మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఆగ్రహంతో ఊగిపోతున్న టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి

సాలూరు: మున్సిపాలిటీ మీ తాతగారిదా? మేము అధికార పార్టీలో ఉన్నాం అంటూ వయస్సు పైబడిన మహిళా మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మపై టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి ఆగ్రహంతో ఊగిపోయాడు, బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం పూర్తయిన తరువాత, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న వార్డుల్లో నీటి సరఫరా కోసం నూతనంగా ఏర్పాటుచేసిన ట్రాక్టర్ వాటర్‌ట్యాంకర్‌ను చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు ప్రారంభించారు. అక్కడి నుంచి ఆమె వస్తున్న సమయంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి పండగ పనులపై ఆరోపణలు చేస్తూ చైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ మీ తాతగారిదా? మేము అధికార పార్టీలో ఉన్నాం అంటూ కనీసం ఆమె వయస్సుకు విలువ ఇవ్వకుండా విరుచుకుపడ్డాడు, టీడీపీ పట్టణాధ్యక్షుడితో పాటు పలువురు టీడీపీ నాయకులు ఆమెపై విరుచుకుపడడంతో శ్యామలాంబ తల్లి అంతా చూస్తుందని, ఎవరు తప్పు చేస్తే వారికి ఆ పాపం తగులుతుందని అంటూ చైర్పర్సన్ కంటనీరు పెట్టుకుంటూ చీర కొంగుతో తుడుచుకుంటూ నిస్సహాయత వ్యక్తం చేశారు. ఈ విషయం గుర్తించిన మున్సిపల్ వైస్ చైర్మన్ సంఘటనా స్థలానికి వచ్చి చైర్‌పర్సన్‌పై ఇలా మాట్లాడడం సమంజసం కాదని, పండగ పనుల నేపథ్యంలో అధికారులు అజెండాలో పెట్టిన అన్ని అంశాలను కౌన్సిల్‌లో ఆమోదించామని తామెప్పుడూ పండగ పనులకు ఎటువంటి అడ్డంకులు సృష్టించలేదని, సహకరించామన్నారు. టీడీపీ కూటమి పెద్దలు ఈ పండగకు ప్రత్యేక గ్రాంట్లు తెస్తామని హామీలు ఇచ్చి తేలేక, చివరకు అప్పు (రియింబర్స్‌మెంట్)గా వచ్చిన రూ.2 కోట్లతో పండగ ముందు పనులు చేయించుకోలేక వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇటువంటి రాజకీయాలకు దిగుతున్నారంటూ పలువురు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

సుఖీభవ లేక.. దుఃఖం దిగమింగలేక..!

- డోలాయమానంలో అన్నదాతలు
- పథకం మంజూరుకు పూర్తికాని వెరిఫికేషన్
- మరో 15 రోజుల్లో ఖరీఫ్‌సాగు ప్రారంభం
- సాగుకు అప్పుకోసం రైతన్న వెతుకులాట



పూసపాటిరేగలో ఖరీఫ్‌సాగుకు సిద్ధమైన భూములు

పూసపాటిరేగ: రైతు సంక్షేమానికి పెద్దపీటవేస్తామని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం ఏడాదవుతున్నా ఇచ్చిన హామీని నెలబెట్టుకోవడంలో విఫలమమైంది. కేంద్రం నుంచి మంజూరు కావాల్సిన పీఎం కిసాన్ నిధులు రైతుల అకౌంట్లలో ఇప్పటికే జమకాగా, రాష్ట్రం నుంచి అందజేయాల్సిన అన్నదాత సుఖీభవ మంజూరుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకంలో ప్రతి రైతుకు రూ.20 వేలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకోలేదు. రెవెన్యూ రికార్డుల ప్రకారం జిల్లాలో 4,85,158 మంది రైతులు ఉండగా ఇప్పటివరకు 1,42,222 మంది రైతుల రికార్డులు మాత్రమే తనిఖీ అయ్యాయి. ఇంకా 3,42,936 మంది రికార్డుల వెరిఫికేషన్ పూర్తి చేసిన తరువాత వ్యవసాయ అధికారి లాగిన్‌లో వెరిఫికేషన్ పూర్తి చేశాక తుది జాబితా సిద్ధం కానుంది. ఈనెల 20వతేదీ లోపు రికార్డుల వెరిఫికేషన్ పూర్తి చేయడానికి గడువు ఇచ్చినట్లు సమాచారం. రబీ సీజన్ దాదాపు పూర్తవడంతోమరో 15 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చే అవకాశం ఉండడంతో ఇప్పటికే చెదురుమదురుగా వర్షాలు పడుతున్నాయి. ఈసమయానికి గతంలో రైతు భరోసా నిధులు రైతుల అకౌంట్లలో జమఅయ్యేవి. నేటి పరిస్థితి చూస్తే భిన్నంగా ఉంది. అన్నదాత సుఖీభవ కోసం జిల్లాలోని రైతులు ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే మార్గదర్శకాలను అనుసరించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసి రైతులకు అవసరమైన పెట్టుబడి సాయం అకౌంట్లలో జమచేసి, ఎరువులు, విత్తనాలు రైతులకు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేవి. వీటితో పాటు వైఎస్సార్ పంటల బీమా, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందించే వారని, నేడు ఆ పరిస్థితి లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుఖీభవ సాయం తక్షణమే వేయాలి

ఖరీఫ్ సీజన్ మరో 15 రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉండడంతో అన్నదాత సుఖీభవ సాయం తక్షణమే రైతుల అకౌంట్లలో జమచేయాలి. గతంలో మాదిరి సాగు పెట్టుబడికి సాయం అందజేయాలి. రైతుల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించాలి.

– సీహెచ్.అప్పలనాయుడు, రైతు రెల్లివలస

సాయం ఎప్పుడు వేస్తారు..?

ప్రతి ఏడాది మే నెలలో వేయాల్సిన పెట్టుబడి సాయం రైతులకు ఎప్పుడు వేస్తారు? అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా రైతులను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. పెట్టుబడి సాయం కోసం ఇంకా వెరిఫికేషన్లు పూర్తికాని పరిస్థితి. అధికారులు సర్వేలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించి అన్నదాత సుఖీభవ ఖరీఫ్ సీజన్‌కు ముందే అందేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– కోరాడ వెంకటరమణ, రైతు పూసపాటిరేగ

శుభం చిత్రయూనిట్ సందడి



హిమగిరి థియేటర్‌లో శుభం చిత్రయూనిట్ సందడి

విజయనగరం టౌన్: ప్రముఖ హీరోయిన్ సమంత నిర్మించిన శుభం చిత్రయూనిట్ విజయనగరంలో బుధవారం సందడి చేసింది. ఈ మేరకు స్థానిక సప్తగిరి మల్టీప్లెక్స్‌లో సెకెండ్ షోలో ప్రేక్షకులను సినీ హీరోలు, హీరోయిన్లు షాలిని, షరియా, హర్షిత్, చరణ్, శార్వాణి, శ్రీనివాస్‌లు అలరించారు. దర్శకుడు కె.ప్రవీణ్, హాస్యనటుడు వంశీ ఇతర నటులు సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగరం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లావాసుల ఆదరణ ఎనలేనిదన్నారు. తమ చిత్రాన్ని విజయవంతం చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమంత తన సొంత నిర్మాణ సంస్థ ఏర్పాటుచేసి తమ లాంటి వారికి అవకాశమిచ్చి బాగా ప్రోత్సహించారన్నారు. సినిమా మొత్తం ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని తీశారన్నారు. ఫ్యామిలీస్ బాగా ఎంజాయ్ చేస్తున్నారని చెప్పడం మర్చిపోలేని అనుభూతి ఇచ్చిందన్నారు. త్వరలోనే మరిన్ని చిత్రాల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకుంటామన్నారు.